దొంగమొహం

కుంటికాలు దొంగపాపడు వొంటి పక్షి. పాపడి మొగం దొంగమొగానికిమల్లే వుంటదని సానామంది పాపణ్ణి దొంగపాపడంటారు. దొంగమొగాలకి పెళ్ళిళ్ళు కావు; పెళ్ళేగాంది పిల్లలుమటుకు యాణ్ణుంచి వొస్తారూ? మొదలు పాపడికి నా అనేవోళ్లంటమే పెద్ద అనుమానమైన యిసయం. ఆసలు పాపడు ఏ జనమలోనో బహుపాపం చేసుకునుంటాడు. అందుకే వాద్ది దొంగమొగం.

కుంటికాలు పాపడి కడుపు కొట్టింది. మరి ఎప్పుడేం పాపకరమం జేసుకుంటే ఏ దేవుడేం ఆ కాలుకాత్తా అట్టా జేసిపొయ్యాడో – మొత్తానికి అదేదో జబ్బులో తన కాలుకాత్తా కాటికి కూటికి కాకుండా పడిపోయిందని సెప్పుకుంటాడు పాపడు.

ఆ వూరి బజార్లో తింటానికి కాత్తేవన్నా దొరుకుద్దేమోనని కుంటికాలు యీడ్చుకుంటా పద్దాకా మలుపులన్నీ తిరుగతా వుంటాడు పాపడు. తనది దొంగ మొగమని ఆరీరు సెప్పుకుంటుంటే సానాసార్లు యిన్న పాపడు ఎందుకయినా మంచిదని పై కండవాతో మొగం సానామటుకు సాటుసేసుకుని తిరుగుతా వుంటాడు అటిటు బిత్తరసూపులు సూసుకుంటా.

ఓనాడు సందెసీకట్లో ఎంకటసుబ్బయ్యగోరి యింటి ముంగలగా కాలు యీడ్చుకుంటా ఎల్తుండాడు పాపడు. అప్పటిదాకా మూసుకునుండ తలుపు పెటీమని తెరిసి తుస్సు బుస్సు మంటా గుమ్మంలోంచి తల బయటికిబెట్టి ఒకచేమయిన సీదరించుకుంటుండది ఎంకటసుబ్బయ్యగోరి పెల్లాం సీతామాలచ్చుమమ్మగోరు.

ఊపుమీద సరిచి లేపినట్టు సీతామాలచ్చుమమ్మ దూకుడుకు ముంగల కాత్తె అదిరిపడ్డా ఎంటనే తెప్పుల్లుకుండ పాపడు 'పొండంటి కాపరానికి ఏం సిక్కులొచ్చిపడ్డయ్యో' అనుకుండాడు మాలచ్చుమమ్మను కాత్తె నిదానంగా సూసి.

"ఎవర్రా పొయ్యేదీ?" అంది మాలచ్చుమమ్మ జరిసె యిసిరేసినట్టు.

"నేనేలే దొర్సానమ్మగోరూ, పాపణ్ణి" అన్నాడు పాపడు కాత్తె అరుగు దెగ్గిరకొస్తా.

"మీద కొస్తావేం, కాస్త దూరాన చావు – అయినా అసలీ మనిషితో

ఎట్టా కాపరంచేయటం? రామరామరామ ఓపెళ్ళాం, పిల్లలూ, కొంపా గోడూ–అసలు ఏదీ పట్టించుకోకుండా తుడిచేసుకుపోతుంటె. నా బొంద నే నేం వెలగబెట్టనూ యీ కొంపలో? వుద్యోగం సద్యోగం లేకబోయినా వూహ ఆ వీధులన్నీ ఆ పొడుంముక్కేసుకుని బలాదూరు చుట్టి రామంటేసరి అదే మనకు యిహం, పరం! వూళ్ళోవాళ్ళేంకాపరాలు చేసుకోటంలా? వాళ్ళకూ పెళ్ళాం బిడ్డల్లేరూ? అవ్వ, ఎవళ్ళన్నా వింటే ఇట్టేనవ్విపోతారు! యింటికొచ్చేసరికి, అన్నీ అమరిగ్గావార్చి సిద్ధంచేస్తే బ్రుదనచీది, ప్రేవుమని ప్రేన్చి శతకాలు వర్ణించుకుంటూ, పవళించేసరికి జన్మలుతరించిపోతుండె! వూఁ, వారుస్తారు సిద్ధంగా! ఒక్కటంటే ఒక్క పదార్థం యింటో మంటబెట్టరు, తింటానికి అన్నీ వర్రగా వుండాలి! బొందమీద ఇంత బెల్లంగడ్డ పారేసిపొమ్మని వారంరోజుల్నుంచి కోడై కూస్తున్నా, ఎదీ?" అవజాన మంగలంలో పేలాలు వేపినట్టు పెటపెటలాడి స్తుండది మాలచ్చుమమ్మ.

"పుల్చులో బెల్లం పడకబోతే దాని రుసే పోయె!'' అన్నాడు పాపడు బెల్లంమాట యినేతలికి.

"ఎవర్రా నవూ, చుంచుకుమల్లే అక్కణ్ణుంచున్నావూ, చీకట్లో కనపడకుండా!" అన్నది మాలచ్చుమమ్మ పాపణ్ణి అప్పుడి కప్పుడు సూసినట్టు.

"నేను పాపణ్ణి గదటండి దొర్సానమ్మగోరూ" అన్నాడు పాపడు.

"పాపం బద్దలయినట్టే వుంది – ఒరేయ్ పాపడూ!'' అన్నది మాలచ్చుమమ్మ పాపణ్ణి నిలువునా చూస్తూ

"యీడే వుండా దొర్సానమ్మగోరూ" అన్నాడు, పాపడు మనిషి నిలదొక్కుకుంటా.

"యీయన నేమన్నా కనుపించార్రా నీకూ?''

"యీయ నెవురండి దొర్సానమ్మగోరూ" అన్నాడు పాపడు.

"నా బొందా, నీ బొందా – మా వారు ఎక్కడన్నా కనుపించార్రా?"

"అబ్బే, అగుపిస్తే సెప్పనంటండి దొర్సానమ్మగోరూ!'' అన్నాడు పాపడు.

"ఎక్కడన్నా వూరేగనీ – యిదిగో పాపడూ, నీకు పుణ్యముంటుంది, కాస్త ఆ వెంకటస్వామి కొట్టుకు వెళ్ళి ఓ సవాపావుబెల్లం మీ అయ్యగారిపేరు చెప్పి తెచ్చిపెడ్తావుర్రా?"

"అబ్బే, అదెంత పనండి దొర్సానమ్మగోరూ, యిమానం ఎల్లినట్టు

ఎల్లిరానూ.''

సీతామాలచ్చుమమ్మ బెల్లంకోసం గుమ్మంలో ఆటనే కూకుందది.

"ఈ క్షుద్రసుభన్నాసివాళ్ళనంతా బతిమలాడాల్సిన ఖర్మేం పట్టిందంటా? పులుసులోకి బెల్లం లేకబోతే యీ అడ్డమైన అంటపక్షులా యిహ దిక్కూ - అప్వ, వెంకటసుబ్బయ్య తండ్రీ-" అంటా తపనపడ్తుంది మాలచ్చుమమ్మ యింకూసేపట్లో పాపణ్ణి సూసింది.

"యేమిరా యిచ్చిచచ్చారుట్రా బెల్లం- ఏదీ చూద్దాం- అదేమిటి మీద పడ్తాడాయేం ఖర్మా- అక్కడ కింద పెట్టిచావు- యిదేమిటీ, బరువేలేదం! ఎంత దిరా యీ బెల్లం?" అంది సీతామాలచ్చుమమ్మ పాపడు తెచ్చిన బెల్లం చేతికి తగిలీ తగలంగానే ఆటనే దిగజారిపోతూ.

"ఎంకటసామిః యిచ్చింది ఆటనే తెత్తినిగా!" అన్నాడు పాపడు సేతులు మెలికలేసుకుంటా.

"ఎంతని చెప్పి యిచ్చాడ్రా వెంకటస్వామీ" అంది సీతామాలచ్చుమమ్మ వూపిరి బిగబట్టి

"తవుఃరు చవాపావు తెమ్మంటిరీ, ఆయన చవాపావు తూసియిచ్చె, యింతలో ఏమయిద్దీ?" అన్నాడు పాపడు.

"ఆయ్యో, యిక నే నేం జేతునూ-యిది సవాపావు బెల్లంట్రా దొంగపక్షీ? అసలు పొట్టం ఆట్టా కట్టివుంటేనే అనుకున్నా ఖర్మ కాలిందని! ఎంత తిన్నాడో ఏమో! కొరికి తిన్నాడ్రా ఏమిటి ఖర్మా? ఎంగిలిమంగలం- అయ్యో నే నేం జేతునూ! పుణ్యానికిపోతే పాపమెదురైనట్టు వీధిలోకిరాంగానే యీ దొంగమొహం పక్షి ఎదురైనాడు! అయ్యో భగవంతుడా- యిదిగో వారు రానే వచ్చారు సమయానికి- ఏం వస్తే, ఏం లాభం, అంతా భగ్గున మండిపోయినాక! అసలు యింటోనే వుంటే నాకీ ఖర్మ ఎందుకు పడ్తుందీ? ఏమండీ చూశారా యీ అన్యాయం? పులుసులోకి యింతంటే యింత బెల్లమ్ముక్క లేకబోతే, యీ దరిద పక్షి యిట్లా వీధిగుమ్మందగ్గిర కనుపిస్తే పోసీగదా అని కొట్టుకువెళ్లి మీ పేరుచెప్పి సవాపావు బెల్లం తెచ్చిపెట్టిపొమ్మన్నా- ఆ తెచ్చిందెంతో మీరే విచారించి యీ కాపరం యీదుకోండి, నా దార్న నేను నెత్తిన కొంగేసుకుని ఏ కాశో, రామేశ్వరమో వెళ్ళిపోతా-" అన్నది సీతామాలచ్చుమమ్మ ఎంకటసుబ్బయ్యగోరు లోనకి వచ్చి రాకతలికే.

లోన కొచ్చిన ఎంకటసుబ్బయ్యగోరు ఆటనే కూసేపు కళ్లు మూసుకు

నిలబడి— ఎల్లి నడవ తంబానికి దారగిలబడ్డ మాలచ్చుమమ్మనూ, బిత్తర సూపులు సూత్తుండ పాపణ్ణి ఒక్కక్షణం పరకాయించి సూశాడు.

"యిదుగో నువు కాశీ రామేశ్వరాలుగనక వెళ్ళదల్చుకుంటే వంచిరోజు చూసి అట్లాగే రైలెక్కించి వస్తాగానీ— అయినా ఎప్పుడు చూసినా యీ పులుసులోకి బెల్లాలు లేకపోటమేమిటి మరీ యిదిగా వుంది నీతో? యిహ ఎన్నాళ్ళు పోయినా కాపరం యిట్లాగే సాగించదల్చుకున్నావా ఏమిటి? ఎప్పుడు చూసినా ఏ మెరపకాయ తొడిమో తక్కువయిందని నడిబజార్లోకొచ్చి గంట మోగించంది గాని, నువు వంట చెయ్యవా ఏమిటి ఖర్మ?" అన్నాడు వెంకటసుబ్బయ్యగోరు సిరాగ్గా.

"నన్ను రైలెక్కిచ్చి వీధలన్ని తిరిగి, మీరే గంట మోయించిరండి— అవ్వ! ఎవరన్నా వింటే ఇట్టే నవ్విపోతారు— ముందా సవాపావు బెల్లం సంగతేమిటో విచారించండి. తరవాత లోపల కొచ్చి వాలకపోద్దురుగాని" అంది మాలచ్చుమమ్మ తంబంకాణ్ణుంచి.

"ఆ బెల్లం ఎంతరా పాపడూ?" అడిగాడు ఎంకటసుబ్బయ్యగోరు.

"చవాపావు యిచ్చారని యిందాకనే దొర్సానమ్మగోర్తో సెప్పానండి దొరా—"

"నిజం చెప్పు."

"తూకం ఏపియ్యండి, దొరా."

"పొట్లం సహం విప్పివుంటే యింకా తూకమేమిటి నా బొందా—" అంది మాలచ్చుమమ్మ తంబంకాణ్ణుంచి.

"అదెందుకయిందో దొరా—" అంటున్నాడు పాపడు— వెంటనే పాపడి యీపుమీన పెటీ పెటీమంది వరసవరసన ఎంకటసుబ్బయ్యగోరి సెయి.

మరసనాట్నుంచి వూళ్ళో సానామంది జనానికి పాపడి మొగం అచ్చంగా దొంగమొగానికిమల్లే అగుపించింది. కొన్నాళ్ళకి అనుకుండాడు పాపడు తన మొగం దొంగమొగానికిమల్లే వుంటుందని.

* * *

ఓనాడు కాలు లాక్కుంటా వూరు సివర్నుండ లంబాడికొట్టుదెగ్గిరికి సేర్తుండాడు పాపడు.

"ఒరేయ్, ఒరేయ్ రాములూ, దొంగపాపడు వస్తున్నాడోయ్" అంది సుబ్బులు, రాములుకు కన్ను కలుపుతూ, తన సేతిలో బెల్లపులడ్డు వెనక్కి

దాసుకుంటూ.

"పసిపట్టేసట్టొచ్చాడే పీడుంపతెగా!" అన్నాడు రాములు తన లడ్డును రెండుచేతుల్లో కప్పిపెడ్తూ.

కొట్టుమీన తంబాలసాటున కూకుని, నిక్కినిక్కి సూత్తుండ పిల్లకాయ రాముల్ని, సుబ్బుల్ని సల్లగా ఓ సూపు సూసి, వొచ్చి అళ్ళకి కాత్తె అసంటగా కూకుండాడు పాపడు మొగమ్మీనకి కండవా లాక్కుంటా.

సుబ్బులు రాములుకళ్ళి సూసింది రాములు ఓరగా పాపణ్ణి సూసి, సుబ్బులకు కన్ను మలిపాడు, తన లడ్డుతీసి తింటూ. కాత్తె రాములుకు దెగ్గిరగా జరిగి, పాపణ్ణి సూసీసూడనట్టు లడ్డుతీసి వంటికాడికి పోనిచ్చింది సుబ్బులు.

"ఒరేయ్, నీకు డబ్బు లెక్కడివిరా రాములూ" అంది సుబ్బులు మెల్లిగా.

"మా నాన్నకు తెలియకుండా తెచ్చా అణా" అన్నాడు రాములు మెల్లిగా.

"తెలుస్తే చంపుతాటా మీ నాన్నా?" అంది సుబ్బులు.

"బలపం కొనక్కున్నానంటా" అన్నాడు రాములు.

"ఒరేయ్. కానీకి ఒక్క బలపంగదా, యింకా ముక్కాణీ ఏంచేశావని మీ నాన్న అడుగుతే?" అంది సుబ్బులు.

"నాలుగు బలపాలు కొనుక్కున్నానంటా" అన్నాడు రాములు.

"బలపాలు ఏవంటే?"

"అనడుగా."

"అంటే?"

"అంటే, బళ్ళో దస్తరంలో పెట్టుకుంటే ఎవరో ఎత్తుకుపోయినారంటా."

"అంటే వీపు చళ్ళమంటుంది."

"ఏమందులే. అంటే మా అమ్మ వుందిగా. హూఁ మా అమ్మ లేకపోతే నే అణా తీసుకురాకేం!"

"ఒరేయ్. తెలియకుండా డబ్బులు తీసుకురావటం దొంగతనం కాదుట్రా?"

"దొంగతనమేగానీ, కోమటి అక్కమ్మ అప్పుడే లడ్లు కడ్తుంటే నోరూరిందే సుబ్బులూ- నీగ్గూడా తెచ్చిపెట్టానుగామ్మా పాపం?" అన్నాడు రాములు లడ్డు చప్పరిస్తూ.

"అవునా రాములూ, బలే రుచిగా వుంది లడ్డు! యీసారి నేనూ అణా తెస్తే నీకూ లడ్డు పెడ్తాగా! ఒరేయ్ చూడ్రా, నా లడ్డు యింకా వేడిగా వుంది" అంది సుబ్బులు రసం చీకుతూ.

''ఎహెపో, నా వొంటికంతా రాస్తున్నావు - చొంగంతా'' అన్నాడు రాములు.

''చొంగ కాదురా, పానకంరా!'' అంటున్నది సుబ్బులు నవ్వుతూ.

''ఏం పానకమో మోచేతిదాకా కార్తున్నది-'' అంటున్నాడు రాములు.

వడదెబ్బ తిన్నవోడికి నీలగాలి తగిల్నట్టు కడుపుకాక మీన ముసుగేసుక్కూకుంద పాపడి ముక్కుకు అదెమయిన బెల్లప్పాకం వాసనా, సెవులకు సప్పరింతలూ గాటుగా తగిలేతలికి దప్పికకు తట్టుకోలేక, పగ్గాం తెంచుకుపద్ద గిత్తకిమల్లే గబిక్కిన లెగిసొచ్చి రాములూ, సుబ్బులుకు ముంగల నిలబడ్డాడు రొప్పుతా నోటెంట నీలుగారుస్తా

''కాత్తె ముక్కపెడ్తే తప్పెట్టా?'' అన్నాడు పాపడు కళ్ళు మెరుస్తా.

''వూఁ-'' అన్నాడు రాములు.

''అమ్మో-'' అంది సుబ్బులు.

తెలవకుండానే కొట్టుమీన్నుంచి దూకిన దూకటం సందుమలుపున బడి అరుస్తా లగెత్తారు రాములూ సుబ్బులూ ఎనక్కి తిరక్కుండా.

''ఏందిరది పాపడూ?'' అన్నాడు బజార్నపోయే రాగవయ్య.

''పిల్ల లెంటపడ్డాడూ'' అన్నాడు బజార్నపోతుండ బసవయ్య.

''పసిపిల్లలు భయపడి పరుగెత్తుతుంటేనే!'' అన్నాడు బజార్నపోతుండ కనకయ్య.

''ఎహె, దొంగమొగాన్ని లంబాడికొట్టో పడేదాకా ఓ పోటు పొడవండసె చూస్తారు?'' అన్నాడు ముల్లుగర్రతో పొలంబోతుండ రాంకిట్టమ్మ.

* * *

ఆనాడు పాపడివాళ్ళు కాకతగిల్నట్టుగుంది. లంబాడికొట్టు మీన గోడకు అదుముకుని కందవా కప్పుకుని కాత్తెకాత్తె వొనుకుతా ముడుసుక్కూకుండాడు. బయట ఓ పక్క నెలవంక పొడిసి ఎన్నెల అగుపిస్తుంటే యింకోపక్కనించి మేగాలు కమ్మి గాలి యిసుర్లో వానతుప్పర పడ్తుందది.

తన బతుకు ముదనష్టకంగా వుందనుకుండాడు పాపడు. ఈ పెపంచకంలో రెక్కలిర్సుకుని కష్టపడేవోడి బతుకే అంతంతమాత్రం; యిగ కుంటిపచ్చి తన బతుకింకెట్టుండాల? అమ్మ బతికుంటే ఇప్పుడు తనకి ఎట్టుండేదో? అమ్మ బతికుందప్పుడు తన కాలు యింకా పడిపోలా. మార్కెటులో కూలాన్నలి సేసుకుని అడిముక్క గిడిముక్కకు కాణీ, అర్ధణాపోయినా దినానికి అర్ధరూపాయో

పదణాలో అమ్మ సేతిలో పెట్టేవోడు తను. అమ్మ దొగ్గలాకు పుల్చుకూర ఎంత కమ్మగా సేసేది! కారం మెతుకులు పెట్టినా కడుపునిండేది! హుఁ— సచ్చి యాడుండో! నా పెల్లికని - మరి ఎట్ట కూడబెట్టిందో ఏమో యిరవై రూపాయి బిల్లలు దారంపంచీలో గెట్టిగాకట్టి యాడో సూర్లో పెట్టిందంట! ఆట్ని కాత్తా ఎలికలు యీడ్సుకు బోయినయ్ అని ఓనాడు లబలబమంది. సేసింది తెలిఏ తక్కువపనయితే ఏడవటం దేనికని నేనంటే యిరకనే వోయిందిగా? యిగ అటనే రాలిపోయింది, నా పెళ్లి కాలేదనుకుంటా. పోవటమే మంచిదయిందిలే - ఒకటికి రెండు పానాలు అడుక్కుడింటా మాట్టం దేనికి? అయినా అమ్మ ఏమూర్తాన పోయిందో ఆనాట్నుంచే తను దిక్కులేని పచ్చయి పోయినాడు. తన కాలు పడి పోయింది. కాలు పడి పోకుండా ఎసువంటి వైద్దికంసేత్తే నయమవుద్దో వైద్దికుడికి తెలవాల్సిందేగాని, తనకెట్ట తెల్సుద్దీ? యింతకీ తన మొగమ్మీన ఏందో రాసుండది. అట్టరాసుండకనేబోతే పెత్తోనూ తన మొగంకల్లి అట్టెందుకు సూత్తారూ? అనుకుంటా కాకరిచ్చి వుమ్మేసి, కండవా యింకొత్తె బిగలాక్కుని, వొనుకుతా కూకుండాడు పాపడు.

ఈదురుగాలి కాత్తె తగ్గి వానజల్లు సాగింది. నెలవంక మబ్బుల్లోకి దూరి అటిటు లగెత్తుండది. ఎవురో కర్ర మోపు మీన వొంగిపోయి, వొనుకులు పక్కడొంక మలుపుతిరిగి సల్లగా రాటం సొష్టంగా సూశాడు పాపడు.

సుండు నాయకుల కుక్క బొయ్‌మంది, ఆ మడిసిని సూసి. ఆ మడిసి మాట్టాడకుండా వొచ్చి లంబాడికొట్టుకాడ ఆగింది.

"ఈ కొట్టుమీన కూకుంటే ఎవురేం అనరుగా?" అం దా మడిసి కొట్టు అరుగు ఎక్కుతా.

"కూసుని సూత్తే అదే తెల్సుద్దీ" అన్నాడు పాపడు ఆ మడిసిని యిడవ కుండా అటనే సూస్తా. గొబ్బిరిపీసుపాయలు దీసినట్టు ఆ మడిసి జుట్టు అట్టుండ దేమనుకుండాడు పాపడు.

సన్నగా తీగెకిమల్లే వొంగిపోయిన ఆ మడిసి సల్లగా ఆ కొట్టుమూలకి సేరి గలగలమంటా ఏందో సంచీకిమల్లే దింపుకుని ఆడే నక్కి కూకుండది.

"ఎవూరేం?" అన్నాడు పాపడు కొట్టుమూలకి సూస్తా.

"ఎవూరయితేయేం బాబూ, యింత అడుక్కుదింటానికీ?" అంది ఆ మడిసి.

"చరేలే! అయితే అడుక్కుదింటానికన్నమాట నువు యీడకి సేరింది—

అయితే సరేలే!'' అన్నాడు పాపడు.

''ఏం బాబూ అట్టంటావూ? నాబోటోరికి యాణ్ణోకాడ అడుక్కుదినక బోతే ఎట్ట గడుసుద్ది బాబూ?'' అంది ఆ మడిసి.

''బాబేంది బాబూ? యీడ యీ లంబాడి కొట్టుమీన బాబు లెవురయినా యిట్ట వొనుకుతా కూకుంటారెట్టా? ఇప్పుడంటే అన్నావుగానీ, తెల్లారి లెగిసినాక నన్ను బాబు గీబనమాక. నీ పేరేందేం?" అన్నాడు పాపడు.

"జుత్తుపోలి" అంది జుత్తుపోలి.

"యిహ్హ్ హ్ - మాబాగుందిలే" అంటా నవుకుండాడు పాపడు.

మరసనాడు తెల్లారంగానే జుత్తుపోలి జోలి తగిలించుకుని, ఓసేత్తో తాడు గట్టిన చీనారేకు డబ్బా, యింకో సేత్తో కఱ్ఱ పట్టుకుని ఒంటెకి మల్లే మెడ జాపుకుంటా వూళ్లోకి నడిసెల్లింది.

"తస్సదియ్య ఆడగూతురంటే అట్టుండాల!" అనుకుండాడు పాపడు.

మరదేందో జుత్తుపోలిని ఆసే సూత్తుండకొద్దీ పాపడికి కడుపులో ఏళ్ళు బెట్టి కెలుకుతుండట్టయితుండది. అట్ట ఒంటెకి మల్లే పెతిదినం ఎల్లి అడీడ ఏం గీరుకొచ్చుద్దో ఏమో ఆ మూలకి సేరి మాట్టాడకుండా సప్పుడికాకుండా కూకుని ఏం దేందో సప్పరిస్తున్నట్టుంటది. అడుక్కుదినేదానికి అంత సొటు దేనికి? మీనబడి పీక్కుదింటారెట్టా? అడుక్కుని యింత దొరికితే తినేదీ, లేకబోతే పస్తుపండుకునేదీ, అంతేగాని అడుక్కుదినేవోరికాడ ఎవరన్నా గీరుకుదింటారెట్టా? మరి యిగనేంది యీ జత్తుపోలీ? అడుక్కుదింటానే తనని సీదరిచ్చుకుంటుండది. ఏవూరన్నా ఎల్లి అడుక్కుదింటే బాగుండు జుత్తుపోలి. పుండట్టుండి పాపడికి అనుమానం ఏసింది. జుత్తుపోలి తన మొగాన్ని వూళ్లోవోరికిమల్లేనే సూత్తుండదని- కడుపులో కెలికినట్టయింది పాపడికి.

ఆ రేత్తిరి యీదురుగాల్తో వానజల్లు పడ్తుండది వొనుకు పుట్టిస్తా. ఆ రోజంతా పొండుకున్న పాపడు లెగవలేదు. సీకటి పడ్డాక వొకటి రెండుసార్లు కళ్లదెరిసి కొట్టుమూల సూత్తే జుత్తుపోలి అగుపించలా. ఆపైన మత్తులో వొళ్లు తెలవలేదు పాపడికి.

ఎంత రేత్తిరయిందో ఏమో - ఏందో సల్లగా తగిల్నట్టయింది పాపడికి. కళ్ళుదెరిసి సూశాడు పాపడు. ఒక యిగ్రహం తన పక్కన కూకుని సల్లగా తాకుతుండది. ఒక్కపాలి పాపడి నోరు తడారిపోయింది.

"ఎవురూ-?" అన్నాడు పాపడు యినపడకుండా.

"నేనేలే జుత్తుపోలిని. ఇయ్యాల ఏం తిన్లేదా నువ్వూ?" అంది జుత్తుపోలి.

నోట మాట రాటం లేదు పాపడికి. తన వొంటిమీన జుత్తుపోలి సెయి సల్లగా జివుజివున లాగుతుందది!

"లెగు– నాకాడ పుల్చుముద్ద వుందది తిందువుగాని రా." పాపడి రెక్క పట్టుకుందది జుత్తుపోలి.

తన ఒల్లు ఎందుకో వొంగుతుందదనుకుండాడు పాపడు. తనని జుత్తుపోలి ఎలేసిందనుకుండ పాపడు సీకట్లో జుత్తుపోలి మొగంకల్లి సూశాడు.

సల్లగా సెయిపట్టుకుని కొట్టుమూలకి నడిపిచ్చుకెళ్లింది పాపణ్ణి, జుత్తుపోలి.

*